## అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం

**మేడ్చల్/శామీర్‌పేట, నవంబరు 29:** అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని మేడ్చల్ ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మేడ్చల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నవనీత ఆధ్వర్యంలో బుధవారం మూడుచింతలపల్లి మండలంలోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఇద్దరి నుంచి 12 లీటర్ల బీర్లు, 11 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. అలాగే గుర్తు తెలియని వ్యక్తుల నుంచి 63.7 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్సైలు రాఘవ, యూసుఫ్, సిబ్బంది షాబుద్దీన్, చంద్రయ్య, దివకరన్, మన్సూర్, శ్రీశైలం, శ్రీను పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యం



అదృశ్యమైన తిరులమ్మ(ఫైల్)

**పీర్జాదిగూడ, నవంబర్29:** వివాహిత అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బోడుప్పల్ కార్పొరేషన్ పరిధి చెంగిచర్ల వెంకటసాయినగర్ కాలనీలో నివాసం ఉంటున్న భూక్య భిక్షపతి భార్య తిరుమలమ్మ (36). ఈనెల 24వ తేదీన ఉదయం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నిరుపేదలకు అండగా ఉంటా..

**కీసర, నవంబర్ 29:** నిరుపేదలకు అండగా ఉంటామని భోగారం కో-ఆప్షన్ సభ్యులు డబ్బి నర్సింహారెడ్డి అన్నారు. మండల పరిధి భోగారం గ్రామంలో జి.బాల్‌నర్సింహ మృతి చెందారు. కో-ఆప్షన్ సభ్యులు నర్సింహారెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.5వేల ఆర్థిక సాయం చేశారు.

## ఉచిత ఫిజియోథెరపి ఉచిత శిబిరం ప్రారంభం



చికిత్స పొందుతున్న బాధితులు

**మేడ్చల్, నవంబరు 29:** మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో బుధవారం మేడ్చల్ పట్టణంలో ఉచిత ఫిజియోథెరపి చికిత్సా శిబిరాన్ని ప్రారంభించారు. దివ్య సమగ్ర ఆరోగ్య కేంద్రం సహకారంతో మేడ్చల్ పట్టణంలో బస్ డిపో ఎదురుగా జాతీయ రహదారి పక్కన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సందీప్ శర్మ, సోహన్‌లాల్ సిర్వి మాట్లాడుతూ ఈ శిబిరం ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు , మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఈ చికిత్స ద్వారా రక్తపోటు, వెన్నునొప్పి, చేతులు, కాళ్లలో తిమ్మిరి, డయాబెటిస్, సయాటిక్ నొప్పి, థైరాయిడ్, దీర్ఘకాలిక తలనొప్పి, పక్షవాతం, నిద్రలేమి, గ్యాస్, మలబద్దకం, స్థూలకాయం, గర్భాశయ నొప్పి తదితర ఆరోగ్య సమస్యలను ఎలాంటి మందులు లేకుండా తగ్గించుకునే అవకాశం ఉంటున్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో శిబిరం సమన్వయకర్తలు మనోహర్ సిర్వి, ప్రకాశ్ చౌదరి, చిమ్నారం సిర్వి, మోహన్‌లాల్ సిర్వి, సోహన్‌లాల్ సిర్వీ, శేషారాం సిర్వి, కైలాస్ ప్రజాపతి, మనోహర్ లాల్, రమేశ్‌కుమార్, బహుదూర్ గుర్జార్ తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లిలో 2500 మందితో బందోబస్తు

**శేరిలింగంపల్లి:** నియోజకవర్గంకు సంబంధించి మొత్తం 2500 మంది వివిద విభాగాలకు చెందిన పోలీసు బలగాలతో పటిష్ట బందోబస్తును ఏర్పాటుచేయడం జరిగిందని మాదాపూర్ డీసీపీ సందీప్ పేర్కొన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో మంగళవారం ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీసులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వంహించారు.

# ఓటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి..

- **కుత్బుల్లాపూర్‌లో 6 లక్షల 69 వేల 253 మంది ఓటర్లు**
- **590 పోలింగ్ సెంటర్లు**
- **3 వేల మంది నిర్వాహణ అధికారులు**
- **పోలింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీగా బందోబస్తు..**



అల్వాల్ డీఆర్‌సీ సెంటర్‌లో ఎన్నికల విధుల్లో హాజరైన అధికారులు

కుత్బుల్లాపూర్,నవంబర్29: నేడు జరిగే ఓటింగ్‌కు అధికారులు అంతా సిద్ధం చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రతి పోలింగ్ సెంటర్‌లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఓటింగ్ ప్రక్రియకు సర్వం సిద్ధమైంది. నియోజకవర్గంలో 6 లక్షల 69 253 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 590 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అందుకు గాను నిర్వాహణ కోసం 3 వేల మంది ఎన్నికల నిర్వాహణ అధికారులు ఉండగా 42 మంది అబ్జర్వర్లు, స్కాడ్లు విధుల్లో ఉన్నారు. 774 సీఈవీ, 744 డీయూవీ, 814 వీవీ ప్యాడ్ మిషన్లు ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. కాగా అదనంగా 25 శాతం మిషన్లు అత్యవసర సమయంలో ఏర్పాట్లు చేసేందుకు సిద్ధం చేశారు. 41 రూట్లలో ఉన్న పోలింగ్ జరిగే కేంద్రాల్లో 590 వెబ్‌కాస్టింగ్ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు.

**వృద్ధులకు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు..**

పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధులకు, దివ్యాంగులకు కావాల్సిన ప్రత్యేక సదుపాయాలను ఇప్పటికే పూర్తి చేశారు. వారికి కావాల్సిన వీల్‌చైర్స్‌తో పాటు ఇతర మౌలిక సదుపాయాలను అధికారులు కల్పించారు. దివ్యాంగులకు 515 పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా మహిళలకు ప్రత్యేకంగా 56, 182, 280, 310, 409 పోలింగ్ బూత్ సెంటర్లు, మోడల్ పోలింగ్ కేంద్రాలు 36, 144, 305, 398, 437, యువతకు 173 కేంద్రాలకు ప్రత్యేకంగా కేటాయించారు. ఇంతకు ముందే ఇంటివద్ద నుంచి దివ్యాంగులు, వృద్ధులు ఫాం-12 డీ ద్వారా 80 ఏండ్లకు పైబడిన వృద్ధులు 300 మంది, 176 మంది దివ్యాంగులు దరఖాస్తు చేసుకోగా వారిలో మొత్తం 456 ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. దాదాపుగా 10 వేలకు పైగా వృద్ధులు, దివ్యాంగులు ఉండడంతో వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**డీఆర్‌సీ సెంటర్ నుంచి ఈవీఎం మిషన్ల పంపిణీ..**

కుత్బుల్లాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో జరగనున్న పోలింగ్ ప్రక్రియకు అల్వాల్ లయోల కళాశాలలో ఏర్పాటు చేసిన డీఆర్‌సీ సెంటర్ నుంచి అధికారులు, సిబ్బందికి ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు ఏమాత్రం లోటుపాట్లు లేకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసేందుకు బుధవారం ఆర్‌ఓ పులి సైదులు నేతృత్వంలో తగు చర్యలు తీసుకున్నారు. దాదాపుగా 3 వేల మంది అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో భాగస్వాములు కాగా వారికి ఓటింగ్ మిషన్లను, ఇతర సామగ్రిని పంపిణీ చేసి రూట్లలోకి పంపించారు.

**మేడ్చల్, బాలానగర్ జోన్ల పరిధిలో పటిష్ట భద్రత..**

మేడ్చల్, బాలానగర్ జోన్ల పరిధిలో జరిగే ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అల్లర్లు, ఇతర చర్యలు చోటు చేసుకోకుండా పూర్తి భద్రతను ఏర్పాటు చేసిన్నట్లు మేడ్చల్ జోన్ డీసీపీ షబరీశ్, బాలానగర్ జోన్ డీసీపీ శ్రీనివాసరావులు తెలిపారు. మేడ్చల్ జోన్ పరిధిలో ఆరుగురు ఏసీపీలు, 20 మంది సీఐలు, 700 మంది సివిల్ పోలీసులు, 300 మంది సీఆర్‌పీఎఫ్ భద్రతా సిబ్బంది ఉన్నట్లు మేడ్చల్ డీసీపీ షబరీశ్ తెలిపారు. కాగా బాలానగర్ జోన్ పరిధిలో లోకల్ 1500, సీఆర్‌పీఎప్ 300, ముగ్గురు అడిషనల్ డీసీపీలు, ఆరుగురు ఏసీపీలు, 30 మంది సీఐలతో పూర్తి స్థాయి భద్రతను ఏర్పాటు చేసిన్నట్లు బాలానగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్‌రావు తెలిపారు.

### బాధ్యతతో ఓటు వేయండి ..



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నేడు జరిగే ఓటింగ్‌కు అంతా సిద్ధం చేశాం. ప్రతి ఓటర్ బాధ్యతతో ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ముందుకు రావాలి. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. నిబంధనల మేరకు ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించేలా తగు చర్యలు తీసుకున్నాం.

**- పులి సైదులు, కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి**



ఉన్నతాధికారులకు రిపోర్టు అందజేస్తున్న ఎన్నికల అధికారులు



పోలింగ్ సెంటర్లకు ఈవీఎం, వీవీప్యాడ్లను ఆయా పోలింగ్ కేంద్రాలను తీసుకెళ్తున్న ఎన్నికల అధికారులు

## పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు..

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 29 : కూకట్‌పల్లి నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఘట్టాన్ని ప్రశాంతంగా.. పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు రిటర్నింగ్ ఆఫీస్ టి.శ్యాంప్రకాశ్ తెలిపారు. బుధవారం జేఎన్‌టీయూహెచ్‌లో ఈవీఎంలు, ఎన్నికల నిర్వహణ సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గానికి చెందిన తుది ఓటరు జాబితాను ప్రచురించడంతో పాటు పోలింగ్ కేంద్రాలను గుర్తించడం, వాటిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈవీఎం మిషన్లు, వీవీప్యాట్లను అనుసంధానం చేయడం ద్వారా ఓటు వేసిన వెంటనే ఏ అభ్యర్థికి ఓటు వేశామో వెంటనే వీవీప్యాట్‌ద్వారా నిర్ధారించుకోవచ్చన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో తుది ఓటరు జాబితా ప్రకారం 4,63,864 మంది ఓటర్లు ఉన్నారు. 2.42.832 మంది పురుషులు, 2.20.909 మంది స్త్రీలు, ఇతరులు 123 మంది ఓటర్లు ఉన్నారు.

### ఓటు హక్కును వినియోగించుకోవాలి..



ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్తులు కావాలని బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. నియోజకవర్గంలో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఇప్పటికే ఇంటింటికి పోలింగ్ చిట్టీలను పంపిణీ చేయడం జరిగింది. ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. పోలింగ్ రోజును సెలవు దినంగా భావించకుండా బాధ్యతగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతున్నాం. ఇప్పటికే ఉద్యోగులు, దివ్యాంగులు, వృద్ధులు 672 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటరు జాబితాలో పేరున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలని కోరుతున్నాం.

**– టి.శ్యాంప్రకాశ్, ఆర్‌వో, కూకట్‌పల్లి నియోజకవర్గం**

## ఆలోచించి ఓటువేసి ఆశీర్వదించాలి



పదేండ్ల కాలంగా కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేశానని.. బంగారు భవిష్యత్ కోసం మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని.. ఆలోచించి ఓటేసి మూడోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించిందని పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో 70 ఏండ్లలో పరిష్కారం కాని సమస్యలను 10 ఏండ్ల కాలంలోనే పరిష్కరించానన్నారు. కులాలు, మతాలు, ప్రాంతాలకతీతంగా ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కామే లక్ష్యంగా పనిచేశానన్నారు. తన హయాంలో వేలాది కోట్ల నిధులను తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని తెలిపారు. కూకట్‌పల్లి హద్దులు తెలియని నాయకులకు ఓటేయడం దండగని అందుబాటులో ఉండే తనను ఆశీర్వదిస్తే నియోజకవర్గంలో మిగిలిన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని తెలిపారు. చేసిన పనులు కండ్లముందే కనబడుతున్నాయని.. కులాలు, మతాలు అంటూ ఉద్వేదంతో కాకుండా విజ్ఞతతలో ఆలోచించి ఓటెయ్యాలని కోరారు.

**– మాధవరం కృష్ణారావు, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, కూకట్‌పల్లి**